రాష్ట్ర బడ్జెట్లో నగరానికి మొండి చేయి..

కాచిగూడ, మార్చి 19: రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు తెలంగాణ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నదని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. బుధవారం బర్కత్‌పురా నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణ ప్రజలకు ఏ పథకాలను అమలు చేసిందో చెప్పాలన్నారు. రాష్ట్రానికి దాదాపు 65 శాతం నిధులు కేవలం హైదరాబాద్ నుంచి వస్తున్నా ప్రభుత్వం బడ్జెట్‌లో హైదరాబాద్‌కు నిధులు పెంచకుండా మొండి చెయ్యి చూపిందన్నారు. నగరంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని, మాన్యువల్స్ సరిగా లేక ప్రమాదాలు జరుగుతున్నామని, ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధిని పట్టించుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అటవీ దినోత్సవం సందర్భంగా 21న ర్యాలీ

అబిడ్స్,మార్చి 19: తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్రశాఖ, వికాస్ భారతి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొని అడవుల పరిరక్షణపై ప్రసంగిస్తారని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, వికాస్ భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ కె. రామ్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1,2,3,4 వలంటీర్లు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి అడవుల పరిరక్షణ కోసం ప్రజలను జాగృతి పరుస్తారని తెలిపారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

● బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్

చాదర్‌ఘాట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ మహాసభ నాయకులు

కాచిగూడ, మార్చి 19: తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 42శాతం బీసీ రిజర్వేషన్ల మాదిరిగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి అమలు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కేంద్రం కుల గణన చేపట్టాలని కోరుతూ బుధవారం చాదర్‌ఘాట్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులగణన చేపడితేనే బీసీల బతుకులు మారుతాయని, దేశంలో 70 కోట్ల మంది బీసీలకు కులాల వారీగా లెక్కలు తీసి విద్య, ఉద్యోగ, రాజకీయ, రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2018లో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దేశవ్యాప్తంగా కుల గణన చేపడుతామని హామీ ఇచ్చారని, అది ఇంతవరకు నెరవేర్చలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి. కృష్ణ, భూషణ్‌భాస్కర్, ప్రదీప్ గౌడ్, వీరేంద్ర యాదవ్, సత్య ప్రకాశ్‌సింగ్, వెంకటరాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభకు టాలెంట్ టెస్ట్‌లు దోహదం

రవీంద్రభారతి,మార్చి19 : విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి టాలెంట్ టెస్ట్‌లు దోహదపడతాయని స్క్వాడ్రన్ లీడర్, నేషనల్ మెమరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎంసీఐ) చైర్మన్ జయసింహ అన్నారు. క్వెస్ట్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(క్వెస్ట్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన 101 మంది విద్యార్థులకు బుధవారం రవీంద్రభారతిలో ఆయన అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ రామ్‌దాస్ తేజావత్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

● యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌కు వినతి

సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుజ్జ కృష్ణ, జయంతిగౌడ్, ఉదయ్ నేత, తదితరులు

కాచిగూడ, మార్చి 19: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, జన గణనలో కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ బుధవారం ఢిల్లీలో గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన బీసీలకు ఆర్థికంగా,రాజకీయంగా కేంద్రం వాటా ఇవ్వాలని, లేని పక్షంలో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యక్షురాలు జయంతిగౌడ్, ఉదయ్‌నేత, దుర్గా నరేశ్, విజయ్, రాఘువేందర్, భిక్షపతి, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టడం హర్షణీయం

మాట్లాడుతున్న బీసీదళ్ అధ్యక్షుడు కుమారస్వామి

కాచిగూడ, మార్చి 19: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకిచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టడం హర్షణీయమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బీసీల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకు వచ్చిన బీసీ బిల్లుకు రాజకీయాల అతీతంగా అన్ని పార్టీలు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు కల్పించిన 42శాతం రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించే పార్టీలను రాజకీయ సమాధి చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ దళ్ నాయకులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు అవగాహన

సదస్సులో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ తదితరులు

జియాగూడ, మార్చి 19 : చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం లోని ఇస్రా హాల్ లో బుధవారం ప్రకృతి క్లబ్ సమన్వయకర్త సాయి భవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ స్థిరత్వం, పుట్టగొడుగుల పెంపకంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ సూర్యధనంజయ్ హాజరై మాట్లాడుతూ.. విద్యా పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. రోజువారీ జీవితంలో స్థిరమైన పద్ధతుల ప్రాముఖ్యతను తెలియజేశారు. డాక్టర్ సాయిభవాని మాట్లాడుతూ.. ప్రకృతి క్లబ్ స్వయం ఉపాధిని ప్రోత్సహించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా కృషి చేస్తుందన్నారు. పుట్టగొడుగుల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని ఆర్జించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకపావని, ప్రకృతి క్లబ్ సమన్వయకర్త డాక్టర్ సాయి భవాని, స్వస్తిక ఎంటర్‌ప్రైజెస్ మహేశ్, పీఆర్‌ఓ కృష్ణాజి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 9 నుంచి ఓపెన్ స్కూలింగ్ పరీక్షలు

కాచిగూడ, మార్చి 19: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(NIOS) సెకండరీ, సీనియర్ సెకండరీ థియరీ పరీక్షలు ఏప్రిల్ 9 నుంచి మే 19 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సంచాలకులు పరంప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్, హాల్ టికెట్లు www.nios.ac.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు విద్యార్థులు 040-2475 2859, 040-24 750712 నంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీ తీర్మాన ప్రతులు దహనం

ప్రతులను తగులబెడుతున్న మాలమహానాడు గౌరవాధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు

రవీంద్రభారతి, మార్చి 19 : వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట మాలమహానాడు జాతీయ గౌరవాధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ నేతృత్వంలో అసెంబ్లీలో చేసిన తీర్మానాల ప్రతులను బహిరంగంగా తగులబెట్టారు. మాల జాతులను దెబ్బతీసిన సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో బొందపెట్టడం ఖాయమన్నారు. వర్గీకరణకు మద్దతు ఇచ్చిన అన్ని పార్టీలపై మాలలు తిరుగుబాటు చేయడానికి మహాసమాజం రోడ్లపైకి పెద్ద ఎత్తున తరలిరావాలని కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ కులాల జనాభా లెక్కలు లేవని కానీ 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేయడం రాజకీయ కుట్రేనని విమర్శించారు. దీనిపైన ఉన్నత న్యాయస్థానాల్లో సవాల్ చేస్తామని ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అడ్డుకొని తీరుతామని ఆయన హెచ్చరించారు. మాలల పక్షాన చట్టసభల్లో బలమైన గళం వినిపించాల్సిన మాల మంత్రులు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, వెంకటస్వామి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్‌రెడ్డి అమ్ముడుపోయారని విమర్శించారు. మాల జాతికి తీరని ద్రోహం చేసిన వారిని మాలజాతి గట్టిగ బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ ప్రధానకార్యదర్శి సంపు శ్రీనివాసలు, పబ్బతి కృష్ణ, గవ్వల శ్రీకాంత్, మద్దిల రాయప్ప, బండి ఈశ్వర్, దేవతి శ్రీనివాస్, చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో బీఆర్‌ఎస్ నాయకులు

అబిడ్స్ మార్చి 19: ఇఫ్తార్ విందులతో ప్రజల్లో సోదర భావం పెంపొందుతుందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఆశిష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ డివిజన్‌లో బుధవారం సల్మాన్, అనీఫ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపవాస దీక్షలు ఉన్న ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సురేశ్ ముదిరాజ్, కోటి శైలేశ్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుల ఏర్పాటు అభినందనీయం

మెహిదీపట్నం, మార్చి 19 : రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న వారికి స్వచ్ఛందంగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేయడం అభినందనీయమని నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం సాయంత్రం మల్లేపల్లిలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్, స్థానిక నాయకులు మహమ్మద్ కైసర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం..

మెహిదీపట్నం మార్చి 19 : రంజాన్ మాసంలో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఫస్ట్ లాన్సర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

గోల్కొండలో ఇఫ్తార్ విందు

మెహిదీపట్నం మార్చి 19: కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ రేతిగల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్, ఎంఐఎం నాయకులు వజీ ఉజ్జమ సిద్దికి, మహమ్మద్ హురూన్ ఫర్హాన్, అమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ లోప్రెషర్ సమస్య పరిష్కారానికి కృషి

హైమద్‌నగర్‌లో తాగునీటి సమస్యను స్థానికులనడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, మార్చి 19: హైమద్‌నగర్‌లో తాగునీటి లోప్రెషర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హైమద్‌నగర్‌లో తాగునీటి లోప్రెషర్ సమస్య ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో బుధవారం కార్పొరేటర్ కాలనీలో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. అధికారులను పిలిపించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో లోప్రెషర్ వాటర్ సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సతీశ్‌గౌడ్, మోసిన్, రఫీక్, అజహర్, డాక్టర్ పాషా, నిజాం, ట్రిక్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి దవాఖాన నూతన కమిటీ సభ్యులకు సన్మానం



మెహిదీపట్నం మార్చి 19 : ఖైరతాబాద్ వాసవి హస్పిటల్ నూతన కమిటీ సభ్యులను లంగర్‌హౌస్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఖైరతాబాద్ లక్డీకాపూల్ వాసవి హస్పిటల్‌లో ఇటీవల ఎన్నికైన కొత్త కమిటీ అధ్యక్షుడు కొత్తూరు జయప్రకాశ్‌రామ్, ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్, మేడం దయాకర్ సభ్యులను బుధవారం ఆర్యవైశ్య సంఘం లంగర్‌హౌస్ అధ్యక్షుడు విప్పు మాథూర్ గుప్తా, కార్యదర్శి రెడ్డిశెట్టి కృష్ణమూర్తి, మాజీ ప్రెసిడెంట్ కంచర్ల వెంకటేశ్‌గుప్తా, సభ్యులు సత్యనారాయణ, పార్షి లక్ష్మణ్, కార్తిక్, మనోజ్, అశోక్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాథూర్ గుప్తా మాట్లాడుతూ.. హస్పిటల్‌ను అభివృద్ధి బాటలో నడిపించాలని, రోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

వివిధ పార్టీల నాయకులతో సమావేశం

మెహిదీపట్నం మార్చి 19 : ఓటర్ లిస్టులో సవరణలపై బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-13 కార్యాలయంలో ఏఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ శశిరేఖ వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల లిస్టు సవరణ, పోలింగ్ బూత్‌ల మార్పు, చేర్పులపై అభిప్రాయాలను సేకరించారు.

కుళ్లిన మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చార్మినార్, మార్చి 19: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే మాంసాహారాన్ని అమ్ముతున్న ఓ వ్యక్తిని దక్షిణ పశ్చిమ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందే శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అఫ్రోజ్ మాంసం విక్రయిస్తుంటాడు. మార్కెట్లో అనారోగ్యం కారణంగా వినియోగదారులు కొనుగోలు చేయని మేకలు, గొర్రెలు, ఇతర పశువులను కొనుగోలు చేస్తూ నిందితుడు వాటిని తన సొంత నివాసానికి తరలిస్తుంటాడు. అక్కడే వాటిని అక్రమంగా వధిస్తూ శుభ కార్యాలతోపాటు ఇంటివద్ద అమ్మకాలు చేపడుతున్నాడు. ఈ విషయమై విశ్వసనీయ సమాచారం అందడంతో నిందితుడి ఇంటిపై దాడి చేశామని డీసీపీ తెలిపారు. దాడుల్లో సుమారు 12 లక్షల విలువైన కుళ్లిన మాంసాహారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం మంగళ్‌హాట్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా ప్రజారోగ్యానికి హాని కలిగించే ఆహారాన్ని విక్రయిస్తే చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. దాడుల్లో సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామితోపాటుగా పశువైద్యాధికారి సాయికిరణ్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సంక్షేమంతోనే సమాజ ప్రగతి

నిజాం కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

జియాగూడ, మార్చి 19 : మహిళల సంక్షేమంతోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని కౌన్సిల్ ఆఫ్ గ్రీన్ రివల్యూషన్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నిజాం కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లీలా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ నేడు సమాజం ముందున్న కీలక అంశాలని పేర్కొన్నారు. గాంధీ మెడికల్ కళాశాల గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వెల్లంకి జానకి మాట్లాడుతూ.. మహిళలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు తాము చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలు సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. నిజాం కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ స్రవంతి మహిళల కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం నిజాం కళాశాల, కౌన్సిల్ ఆఫ్ గ్రీన్ రివల్యూషన్ ప్రతినిధులు పరస్పరం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రేణుక, పీఆర్‌ఓ డాక్టర్ కవిత షిండే, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మెలీసా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు

మెహిదీపట్నం, మార్చి 19 : ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పటాకులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుమ్మరి సత్యనారాయణ, వీఎస్ రాజు, సానేమ్ ప్రకాశ్, నవీన్, దేవరాజ్, నాగేందర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అబిడ్స్ మార్చి 20 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం అబిడ్స్ పోలీసులు స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఎస్సై ఎన్ సుధాకర్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 17న చిరాగ్‌అలీ లేన్ జగదాంబ మోటార్స్ వద్ద 60 ఏండ్ల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అతడిని 108లో ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సుధాకర్ తెలిపారు.

అరుంధతీయ బంధు సేవా మండలి అధ్యక్షుడిగా ఈశ్వర్

రవీంద్రభారతి, మార్చి 19 : అరుంధతీయ బంధు సేవా మండలి తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా జి.ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన జాయింట్ కమిటీ సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉన్న కేపీ నర్సింగరావు ఆకస్మికంగా మృతి చెందడంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జి.ఈశ్వర్ మాట్లాడుతూ.. మాదిగ జాతి అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానన్నారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగ, మాదిగ ఉపకులాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. బి.నర్సింగరావు, జీబీ సత్యేంద్రకృష్ణ, గళ్ళ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా నిర్మాణంలో క్యాస్ట్యూమ్స్ పాత్ర కీలకం

● సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి,మార్చి 19 : సినిమా నిర్మాణంలో క్యాస్ట్యూమ్ డిజైనింగ్ కీలక పాత్ర పోషిస్తుందని సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలోని పైడీ జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నితన్ ఆధ్వర్యంలో క్యాస్ట్యూమ్ డిజైన ఇన్ సినిమా వర్క్‌షాప్ ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌ను సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా రంగంలో అనేక విభాగాల్లో క్యాస్టుమ్ డిజైనింగ్ ఒకటని, ఇది అత్యంత ముఖ్యపాత్ర పోషిస్తుదన్నారు. కథకు తగినట్లు క్యాస్ట్యూమ్ ఉంటనే సినిమా విజయం సాధిస్తుందన్నారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌ను ఔత్సాహిక సినీ ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బహుబలి, కల్కి, సావిత్రి, దొరసాని వంటి సినిమాల్లో క్యాస్ట్యూమ్స్ కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. శ్రీపాద్ మాచర్ల, అక్షరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పీస్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఏసీపీ ఫయాజ్

మెహిదీపట్నం మార్చి19 : ప్రజలు పండుగలను కలిసిమెలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మైత్రి పీస్ కమిటీ సభ్యులతో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు సమావేశమయ్యారు. గోల్కొండ ప్రాంతం లో హిందూ, ముస్లింలు ఒకరికొకరు సహకరించుకుంటూ పండుగలను విజయవంతంగా జరుపుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని ఏసీపీ అన్నారు. సమావేశంలో మైత్రి పీస్ కమిటీ చైర్మన్ సిరుగుమల్లె రాజు వస్తాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో పరీక్షలు రాయాలి

బన్సీలాల్ పెట్, మార్చి 19 : ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, మంచి మార్కులతో ప్రతీ విద్యార్థి పాస్ కావాలని బోయిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.కోటేశ్వర రావు అన్నారు. బుధవారం పదవ తరగతి విద్యార్థులకు ఆయన హాల్ టికెట్లను అందజేసి, ఆల్ ది బెస్ట్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. దాతల సహకారంతో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. జర్నలిస్ట్ శేషగిరిరావు తన తరపున విద్యార్థులకు పెన్నులు అందజేశా రు.

అన్నదానం

మెహిదీపట్నం మార్చి 19: నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చెన్న బత్తిని లక్ష్మీనారాయణ తన తల్లి సరోజ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎన్టీఆర్ బసవతారకం క్యాన్సర్ హస్పిటల్ వద్ద అన్నదానం చేశారు.